ప్రజాశక్తి
శనివారం 3 డిసెంబరు 2022
5
శ్రీకాకుళం

కార్మికుల గొంతుకగా...

- శ్రామికులకు అడుగడుగునా అండగా నిలిచిన సిఐటియు
- కార్మికుల కష్టాలు, కన్నీళ్లకు తోడుగా నిలిచిన ట్రేడ్ యూనియన్
- ఎన్నో పోరాటాలు... మరెన్నో విజయాలు
- సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగం
- శ్రీకాకుళంలో నేటి నుంచి 11వ జిల్లా మహాసభలు

జిల్లాలో ఎన్నో సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించిన సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) 11వ జిల్లా మహాసభకు సిద్ధమైంది. 1992లో ప్రాణం పోసుకున్న యూనియన్ నిరంతరం కార్మిక సమస్యలపై పోరాడుతూ కార్మిక వర్గ రథసారథిగా గుర్తింపు పొందింది. ప్రభుత్వ నిర్బంధాలు, అణచివేతలను ఎదుర్కొని జిల్లాలో బలమైన సంఘంగా పేరొందింది. కార్మికుల కష్టాలు, కన్నీళ్లకు అండగా నిలిచింది. గత మూడేళ్లుగా సాగించిన పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు మరోసారి సిద్ధమవుతోంది. శ్రీకాకుళం నగరంలోని పెద్దకోట పోలినాయుడు నగర్ (టిటిడి కళ్యాణ మండపం)లో నేటి నుంచి రెండు రోజుల పాటు మహాసభలను నిర్వహించనున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పారిశ్రామికరంగ కార్మికుల సమస్యలపై సిఐటియు అలుపెరుగని పోరాటం సాగిస్తోంది. రణస్థలం మండలం బంటుపల్లిలోని యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం ప్రభుత్వం మద్యం ఆర్డర్లను తగ్గించిందనే పేరుతో పని దినాలు తగ్గించేసింది. కొంతమందిని పనుల్లో నుంచి తొలగించింది. కార్మికులతో కలిసి సిఐటియు పలురూపాల్లో ఆందోళన చేపట్టడంతో, యాజమాన్యం కార్మికులను పనిలోకి తీసుకోవడంతో పాటు రెండేళ్ల సంపాదిత సెలవులను మంజూరు చేసింది. శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 యాజమాన్యం పెండింగ్ బోనస్, వేతన బకాయిల కోసం నిరసన తెలిపిన 570 మంది కార్మికులను నిలిపేసింది. యాజమాన్యం తీరుపై కార్మికులు తీవ్ర పోరాటం సాగించారు. కార్మికుల పోరాటానికి మద్దతుగా ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాలతో సిఐటియు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి యాజమాన్యం వైఖరిని ప్రజల దృష్టికి తీసుకువెళ్లింది.

అరబిందో ఫార్మా వేతన ఒప్పందం అమలు చేసేందుకు మొండికేస్తోంది. ప్రభుత్వ అండతో కార్మిక చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోంది. క్రమశిక్షణ పేరుతో 200 మంది కార్మికులను తొలగించడంతో పాటు వేధింపులకు పాల్పడుతోంది. అక్రమ కేసులు బనాయిస్తోంది. యూనియన్ విచ్ఛిన్నానికి రకరకాల ప్రయత్నాలు సాగిస్తోంది. అక్రమ కేసులు, వేధింపులు, తొలగింపులకు వెరవకుండా కార్మికులు పోరు సాగిస్తూనే ఉన్నారు. నాగార్జున అగ్రికెమ్‌లో వేతన ఒప్పందం విషయంలో యాజమాన్యం పెట్టిన షరతులకు వ్యతిరేకంగా కార్మికులు చేపట్టిన ఆందోళనకు యాజమాన్యం దిగొచ్చి ఈ ఏడాది అక్టోబరులో ఒప్పందం కుదుర్చుకుంది. స్మార్ట్‌కెమ్‌లో కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్ అమలు చేయించుకోవడంతో కార్మికులు విజయం సాధించారు.

ఇతర రంగ కార్మికుల సమస్యలపైనా పోరు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై సిఐటియు అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించింది. శ్రీకాకుళం కార్పొరేషన్, పలాస, ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ కార్మికుల తరుపున పోరాడింది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఇసుక విధానంతో పనులు కోల్పోయిన భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై అనేక ఆందోళనలు సాగించింది. ప్రభుత్వపరంగా వారికి రావాల్సిన సంక్షేమ పథకాల అమలు కోసం పోరాడింది. పొందూరు మండలం రాజ్యలక్ష్మి పోల్స్‌లో ఐదుగురు కార్మికులను తొలగించడంతో సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు 110 రోజులు సమ్మె చేశారు. ఆందోళనలకు దిగొచ్చిన యాజమాన్యం వారిని పనిలోకి తీసుకుంది. పొందూరు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న కార్మికులను తీసేయడంతో కార్మికులు పలురూపాల్లో ఆందోళన చేయడంతో యాజమాన్యం వారికి తిరిగి పనులు కల్పించింది. మందస మండలంలో రైస్ మిల్లు కార్మికుల వేతన ఒప్పందంపై పలురూపాల్లో ఆందోళన చేపట్టిన తర్వాత 25 శాతం మేర వేతనాలు పెంచింది. కోటబొమ్మాళి రైస్‌మిల్లు కార్మికులకూ వేతనాలు పెరిగాయి. మందస జీడి కార్మికులకు 15 శాతం వేతనాలు, మందస హమాలీల వేతనాలు 25 నుంచి 30 శాతం పెరుగుదల వెనుక సిఐటియు వారి వెనుక ఉండి పోరాటం చేసింది.

స్కీమ్ వర్కర్లకు అండగా...

స్కీమ్ వర్కర్ల సమస్యలపై సిఐటియు నిరంతర పోరాటం చేస్తోంది. రాష్ట్రంలో అధికారం మార్పిడి జరిగిన ప్రతి సందర్భంలోనూ చిరుద్యోగుల తొలగింపు, రాజకీయ వేధింపులు సర్వసాధారణమైపోయాయి. వీటిపై కార్మికుల పక్షాన సిఐటియ పోరాడి వారికి వెన్నుదన్నుగా నిలిచింది. ఉమ్మడి జిల్లాలో వీరఘట్టం మండలంలో 28 మంది అంగన్‌వాడీ కార్యకర్తలను తొలగించిన తర్వాత సిఐటియు న్యాయ పోరాటం చేయడంతో ప్రభుత్వం వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంది. ఆమదాలవలస, నరసన్నపేట ప్రాంతాల్లో కార్యకర్తల తొలగింపుపై పలురూపాల్లో ఆందోళనలు చేసింది. ఆశావర్కర్ల సమస్యలపైనా పోరాడి వారికి అండగా నిలిచింది. ఆమదాలవలస, టెక్కలి ప్రాంతాల్లో వర్కర్లు ఎదుర్కొంటున్న రాజకీయ వేధింపులపై పోరాడింది. వైద్యారోగ్యశాఖలో అమలు చేయనున్న ఫేస్ రికగ్నేషన్ యాప్‌ను ఫీల్డ్ సిబ్బందిగా ఉన్న వీరికీ వర్తింపజేయాలని వైద్యారోగ్యశాఖ అధికారులు చెప్పడంపై ఆశా వర్కర్స్ యూనియన్ పోరు సాగించేందుకు సిద్ధమవుతోంది. మధ్యాహ్న భోజన కార్మికులకూ రాజకీయ వేధింపులు తప్పడం లేదు. గార, ఆమదాలవలస ప్రాంతాల్లో కార్మికులను తొలగించేందుకు అధికార పార్టీ నాయకులు చేసిన ప్రయత్నాలను వర్కర్స్ యూనియన్ అడ్డుకుంది.

తోరణాలను కడుతున్న కార్మికులు

సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం

సిఐటియు కేవలం పోరాటాలకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం భాగస్వామ్యమవుతోంది. లాక్‌డౌన్ సమయంలో పలు ప్రాంతాల్లో పనిచేస్తున్న వలస కార్మికులు కాలినడకనే తమ సొంత ప్రాంతాలకు చేరుకునే క్రమంలో అనేక ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారి వెంబడి పలుచోట్ల పాలు, బిస్కెట్లు, పులిహోర ప్యాకెట్లను అందించింది. దీంతోపాటు జిల్లావ్యాప్తంగా పనులు కోల్పోయిన సుమారు రూ.16 లక్షల విలువైన నిత్యావసర వస్తువులు, మాస్క్‌లను సరఫరా చేసింది. కరోనా సమయంలో రక్త నిల్వలకు తీవ్ర కొరత ఏర్పడడంతో సిఐటియు కార్యాలయంలో వంద మందితో రక్తదానం చేశారు.

పలు కూడళ్లలో ఎర్ర జెండా తోరణాలు

సిఐటియు మహాసభ సందర్భంగా పలుచోట్ల ఎర్రజెండాలు, తోరణాలు కట్టారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి, డే అండ్ నైట్ కూడలి, అంబేద్కర్ కూడలి వద్ద జెండాలు, తోరణాలు ఏర్పాటు చేశారు.

శ్రీకాకుళంలో నేడు ర్యాలీ, సభ

మహాసభ సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలిలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం నుంచి ఉదయం 9.30 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నారు. జి.టి రోడ్డు మీదుగా డైమండ్ పార్కుకు చేరుకుని అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గఫూర్ ప్రధాన వక్తలుగా పాల్గోనున్నారు.

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా..?

- అధికారుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం
- కొంచాడ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆదేశాలు
- హౌసింగ్ ఎఇకు షోకాజ్ నోటీసు

అపారిశుధ్యంపై ప్రశ్నిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని కొంచాడ పంచాయతీలో మురుగు కాలువలు చెత్తతో నిండి అధ్వానంగా ఉండడం, పలుచోట్ల పారిశుధ్య నిర్వహణ సమగ్రంగా లేకపోవడంపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అసంతృప్తి చెందారు. పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా ఉండేది అంటూ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రాపాక, నందివాడ, కొంచాడ సచివాలయాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొంచాడలో 24 గంటల్లో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టి చెత్తాచెదారాలను తొలగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్‌ను సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సచివాలయం, రైతుభరోసా కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించారు. రాపాకలో జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పూర్తిస్థాయి సమాచారం లేకపోవడంపై గృహనిర్మాణ శాఖ ఎఇ ఎం.వెంకటరమణపై మండిపడ్డారు. మండలంలో గతేడాది పూర్తి చేయాల్సిన జగనన్న ఇళ్ల నిర్మాణాలపై కలెక్టర్ ఎఇని ప్రశ్నించగా, ఆయన చెప్పలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే ఇంజినీరింగ్ అధికారులతో ఎలా సమీక్షా సమావేశాలను నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. రాపాకలో 2018లో స్వచ్ఛభారత్ కింద చేపట్టిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా పడి ఉన్నాయంటూ పలువురు యువకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ విచారణలో ఉందని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. నరసాపురం వద్ద గల లేఅవుట్‌లో రెండు వారాల్లో విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ ఇన్‌ఛార్జి ఎఇ రవికాంత్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, తహశీల్దార్ ఎస్.గణపతిరావు, ఆర్ఐ ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చైతన్య, సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

మూడేళ్లుగా సాగునీరందడం లేదు

- సీతాపురం రైతుల ఆవేదన
- మంత్రి అప్పలరాజు కాన్వాయ్ నిలుపుదల
- పాడైన పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

శివారు భూములకు మూడేళ్లుగా వంశధార సాగునీరు అందడకపోవడంతో పంటలు పండక తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు సీతాపురం రైతులు మొరపెట్టుకున్నారు. మండలంలోని హుకుంపేటకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్తున్న మంత్రి కాన్వాయ్‌ను సీతాపురం బస్టాండ్ వద్ద సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు, మాజీ ఎంపిటిసి టి.అప్పారావు ఆధ్వర్యాన రైతులు ఆపి పంట పొలాలను చూపించారు. ఎకరాకు రూ.20 వేల వరకు మదుపులు పెట్టామని, వంశధార నీరు అందకపోవడంతో తీవ్రమైన నష్టాలు చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా ఇవే పరిస్థితులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. చివరకు పశువుల దాణాకూ కరువు వచ్చిందని వాపోయారు. రైతులకు ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పెద్దబొడ్డపాడు, సీతాపురం, కొండవూరు, బెండి పరిధిలోని రామసాగరం, ఎర్ర చెరువు, చాకిబందకు బెండిగెడ్డలో ఎత్తిపోతల పథకం గానీ బెండిగెడ్డ చెక్ డ్యామ్ నుంచి కుడి కాలువ ద్వారా సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకుంటే 750 ఎకరాలు సస్యశ్యామలం అవుతుందని రైతులు వివరించారు.

మంత్రికి పాడైన పంటను చూపిస్తున్న రైతులు

వారం రోజుల్లో ప్రారంభం కాకుంటే కఠిన చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం అర్బన్ : ప్రారంభం కాని ప్రాధాన్యతా భవనాలు వారం రోజుల్లో ప్రారంభించకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హెచ్చరించారు. సచివాలయాలు, రైతుభరోసా, గ్రామ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలపై జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ప్రస్తుతం 51 భవనాలు ప్రారంభం కానివి ఉన్నాయని తెలిపారు. మండలాల వారీగా చూస్తే 9 మండలాల్లో ప్రారంభించాల్సి ఉందన్నారు. నిర్మాణాలు ఎందుకు ప్రారంభం కావడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో నిర్మిస్తున్న ప్రాధాన్యతా భవనాలు అన్నీ ఒకేచోట ఉండాలన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి పూర్తి కావాలని ఆదేశించారు. ఇసుక, సిమెంట్, ఇనుము అందుబాటులో ఉందన్నారు. ఎచ్చెర్ల, మెళియాపుట్టి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, రణస్థలం, ఎల్ఎన్ పేట, ఆమదాలవలస, పొందూరు మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాధాన్యత భవనాలను ప్రారంభించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి, ఆర్‌డిఒలు శాంతి, సీతారామ్మూర్తి, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల సర్వేయర్లు, పంచాయతీరాజ్ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, గ్రామ సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా జగనన్న కాలనీలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస, బూర్జ

ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వమే పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చేలా జగనన్న కాలనీల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని పూజారిపేటలో జగనన్న కాలనీల్లో ఇళ్లను శుక్రవారం ప్రారంభించారు. బూర్జ మండలం తోటవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే స్థలాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం అన్నారు. దళారీ వ్యవస్థకు రైతులు దూరంగా ఉండేలా, ప్రభుత్వమే రైతులకు మేలు చేకూర్చేలా ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. గ్రామంలో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న బిసి హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరిన విషయాన్ని గ్రామస్తులు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. మరమ్మతులకు నిధుల విడుదలకు చర్యలు చేపడతానన్నారు. అనంతరం జగనన్న భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు.

గృహాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

బ్లాక్ బోర్డు మీద రాస్తున్న ప్రశ్నలు రాస్తున్న ఉపాధ్యాయుడు

అవస్థల నడుమ ఎఫ్ఎ-2 పరీక్షలు

జిరాక్స్ కేంద్రాల వద్ద ఉపాధ్యాయుల పడిగాపులు

టెక్కలి : పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్ఎ-2 పరీక్షలు ఉపాధ్యాయులకు పరీక్షగా మారాయి. శుక్రవారం నుంచి ప్రారంభమైన పరీక్షల ప్రశ్నాపత్రం హెచ్ఎంలకు వాట్సాప్‌లో పంపించడంతో, కొందరు వాటిని బ్లాక్ బోర్డుపై రాయగా, మరికొన్ని చోట్ల ఉపాధ్యాయుల సొంత ఖర్చుతో జిరాక్స్‌లు తీశారు. ఒకవైపు ప్రశ్నాపత్రం కోసం జిరాక్సు సెంటర్ల వద్ద పడిగాపులు, మరోవైపు నిర్ణీత సమయానికి పాఠశాలకు చేరుకుని ముఖ హాజరు వంటి సందిగ్ధ పరిస్థితులతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురైన పరిస్థితి నెలకొంది. ఎఫ్ఎ-2 పరీక్షల నిర్వహణ ఉన్నత పాఠశాలలకు ఒక ఎత్తు అయితే, ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహణ మరో ఎత్తుగా మారింది. టెక్కలి మండలంలో 69 ప్రాథమిక పాఠశాలల్లో రెండు వేల మందికి పైగా విద్యార్థులు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్నారు. ఒకవైపు యాప్‌ల్లో హాజరు, జగనన్న గోరుముద్ద, మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడ్ చేయడం, మరోవైపు వాట్సాప్ చూసి ప్రశ్నాపత్రం ఐదు తరగతులకు బ్లాక్ బోర్డుపై రాయడం వంటి పనులతో ఉపాధ్యాయులకు ఊపిరి సలపని పరిస్థితి నెలకొంది. మండలంలో 32 పాఠశాలల్లో ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండడంతో ఈ పనులన్నీ చేయడం కత్తిమీద సాములా మారింది.

'పది' మోడల్ పేపర్లు ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్ : పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు అనువుగా ఉండేందుకు యుటిఎఫ్ ఆధ్వర్యాన పుస్తక రూపంలో ముద్రించిన మోడల్ పేపర్‌ను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఒత్తిడి లేకుండా పరీక్షలపై అవగాహనకు మోడల్ పేపర్లు ఉపకరిస్తాయన్నారు. మోడల్ పేపర్లు యుటిఎఫ్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శులు జి.సురేష్ కుమార్, బి.రవికుమార్, జిల్లా నాయకులు బి.క్రాంతి కుమార్, ఎల్.కోదండరామయ్య, ఎస్.స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'తో వలసల నివారణ

మెళియాపుట్టి : గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధిని కల్పించడం ద్వారా వలసలను నివారించవచ్చని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, భూగర్భ జలమట్టాన్ని పెంపొందించడం ఉపాధి హామీ ముఖ్య ఉద్దేశమన్నారు. మండల కేంద్రంలోని ఎన్ఆర్ఇజిఎ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి అంచనాలను రూపొందించాలని సూచించారు. అన్ని గ్రామ పంచాయతీల్లోనూ పనులు చేపట్టాలని ఆదేశించారు.

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

6 నుంచి ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

శ్రీకాకుళం అర్బన్ : ఈనెల 6, 7, 8 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.హరీష్, సిహెచ్.రాజు తెలిపారు. నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మహాసభల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటాల్లో ఎస్ఎఫ్ఐ ముందుంటుందన్నారు. మహాసభలకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానం పేరిట విద్యా రంగాన్ని నాశనం చేస్తున్నాయని విమర్శించారు. ఈ విధానం అమలు వల్ల తరగతులను విలీనం చేసి పాఠశాలలను మూసివేయడం ద్వారా విద్యార్థులకు ప్రాథమిక విద్యను దూరం చేస్తున్నాయన్నారు. పాఠశాలల మూసివేతకు కారణమైన నూతన విద్యా విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర బాలికల విభాగం కన్వీనర్ స్వర్ణకుమారి, కో-కన్వీనర్ మానస తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా

జాయింట్ కలెక్టర్ నవీన్

సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని కొన్ని మండలాల్లో బాలికల నిష్పత్తి తక్కువగా ఉందని, అందువల్ల స్కానింగ్ సెంటర్లపై మరింత నిఘా పెంచాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సలహా కమిటీలో ఆయన మాట్లాడారు. వజ్రపుకొత్తూరు, కంచిలి మండలాల్లో మహిళల కంటే పురుషుల శాతం అధికంగా ఉందన్నారు. జిల్లాలో పది మండలాల్లో ఈ నిష్పత్తి పెరగాల్సిన అవసరం ఉందన్నారు. నిష్పత్తి తగ్గడానికి గల కారణాలను పరిశీలించాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో సిసి కెమెరాలు, మోనిటర్లు పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు.

బాలికల నిష్పత్తి పెరిగేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎఎన్ఎంలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ జిల్లాలో 98 స్కానింగ్ సెంటర్లకు గానూ 80 ప్రయివేటు, 16 పబ్లిక్ సెంటర్లు ఉన్నాయన్నారు. మరో రెండింటికి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ప్రతి స్కానింగ్ సెంటరులో సిసి కెమెరాలు ఉన్నాయన్నారు. సమావేశంలో మహిళా పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి ఎస్.వాసుదేవ్, జిల్లా మాస్ మీడియా అధికారి పి.వెంకటరమణ, బెజ్జిపురం యూత్ క్లబ్ సంచాలకులు ఎం.ప్రసాదరావు, మంత్రి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియరు సివిల్ జడ్జీ వారి కోర్టులో
I.P.23/2022

Between:
పొట్నూరు నాగేశ్వరరావు ...పిటిషనర్లు
And:
వండాన శంకరరావు వగైరాలు
...రెస్పాండెంట్

To,
యావన్మంది ప్రజానికానికి తెలియ జేయనది ఏమనగా పిటీషనరు తనను ఇన్సాల్వెంటుగా డిక్లేర్ చేయమని పై కోర్టులో పై నెంబరుగా నిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషను **తే౹౹ 23-12-2022 దీ౹౹** కు కోర్టు వారు వాయిదా వేసియున్నారు. కావున ఎవరికి ఏవిదమైన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట పై తేది నాడు ఉదయం **10.30ని౹౹**లకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని యెడల పిటిషనరుకు అనుకులంగా తీర్మాణించటమగునని యిందు మూలంగా తెలియజేయుచున్నాము.

కోర్టు వారి ఆర్డరు మేరకు

కింతలి వెంకటరమణ
వాది తరుపు వకీలు,శ్రీకాకుళం.
సెల్: 7989270123

శ్రీకాకుళం,
తేది. 02.12.2022

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.P. 17/2022

Between: Parlapu Narsinga Rao ---Petitoner
And:
01) Kesurapu Bharathi
02) Peddapatl Ramarao
03) Annepu Rangarao
04) Budumuru Ramarao
05) Komarapu Ramana
06) Gedela Apparao
07) Regana Mukhalingam
08) Koyyana Krishna
09) Korada Rajulu
10) Golivi Ram ba bu
11) Kalingapatnam Buloka
12) Mekala Suresh
13) R.Latchareddy --Respondents

GENERAL NOTICE
Take notice that the insolvency petition filed by the above named petitioner is posted for hearing at **10-30 A.M.** on **19-12-2022** before the Honourable Principal Senior Civil Judge Court, Srikakulam, and if you want to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause the matter will be decided in your absence and exparte.

/BY ORDER /
ఆంపోలు సంధ్యారాణి,
హనుమంతు అచ్చిన్నాయుడు,
అడ్వకేట్స్, **ఆమదాలవలస,** శ్రీకాకుళం
సెల్: **7680818742, 9441354088**

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపల్ సీనియరు సివిల్ జడ్జీ వారి కోర్టులో
I.A.54/2022,
I.A. 751/2011 IN O.S. 30/2022

బిట్వీన్ :
పైల రాజేశ్వరి w/o అప్పన్న హిందూ, 51 సం౹౹లు వ్యవసాయం. డోర్ నెం. 5-21, కోత్తపోలవలస గ్రా౹౹, నరసన్నపేట మం౹౹, శ్రీకాకుళం జిల్లా **...పిటిషనర్/వాది**
మరియు :
1. బమ్మిడి భూలోకడు తండ్రి రాజప్పడు, హిందూ, 78 సం౹౹ వ్యవసాయం, ఈదులవలస గ్రా౹౹ పోలాకి మం౹౹, శ్రీకాకుళం జిల్లా.
2.గంగెట్ల అక్కమ్మ w/o రామమూర్తి. హిందూ. 63 సం౹౹లు, డిటో నివాసం,
3. పోతల అప్పారావు S/o లేటు శిమ్మన్న, హిదూ, 68 సం౹౹లు తలసముద్రం గ్రా౹౹, పోలాకి మండలం, శ్రీకాకుళం జిల్లా.
4.పోతల ఎర్రయ తండ్రి లేటు శిమ్మన్న, హిందూ. 66 సం౹౹లు, డిటో నివాసం
5.పోతల లక్ష్మణరావు తండ్రి లేటు శిమ్మన్న, హిందూ. 63 సం౹౹లు, డిటో నివాసం **...రెస్పాండెంట్లు/ప్రతివాదులు**
ఇందు పిటిషినరు పై నంబరు **I.A.751/2011 తే౹౹ 28-13-2018 దీన౹౹** డిస్మిస్ ఫర్ డిపాల్టు అమినందున దానిని రిస్టారు చేయమని **I.A54/2022** నెంబరు పిటిషన్ **683 రోజులు** డిలే కండోన్ చేయమని దాఖలు చేసి యున్నందున ప్రతివాదులు హాజరగుటకు **తే౹౹12-12-2022దికి** పై కోరుట్ల వాయిదా అయున్నది. గావున ఇందున ప్రతివాదులు తేదీన పగలు **10.30ని౹౹**లకు కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని వచ్చి మీ యొక్క అక్షేపణలు తెలియ జేసుకోవలెను. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
కోర్టు వారి ఆర్డరుపై

కె. జగన్మోహనరావు
న్యాయవాది, శ్రీకాకుళం.

శ్రీకాకుళం,
తేది. 02.12.2022

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
I.A.105/2022 IN O.S.97/2016

Between:
Mosa Raja Babu ...Petitioner/ Plaintiff
And:
Mosa Rama Rao (Died) and others
...Respondent/ Defendants

To
Korada Chandra Kumari w/o late Govinda Rajulu, aged 59 years, Hindu, House hold duties,R/at Door No:2-354, KoradaVeedhi, Srikurmam village, Gara mandalam, Srikakulam district.

నోటీసు
పై నంబెర్ దావా లో, పై తెలిపిన చిరునామా దారు అయిన **కోరాడ చంద్ర కుమారి,** పై దావా లోని చని పోయిన 7వ ప్రతివాది **కోరాడ నారాయణ మూర్తి** గారి ముఖ్య వారసురాలై వున్నారు. అందులకు వారి మిమ్ములను పై దావాలో 9 వ ప్రతివాదిగా చేర్చే నిమిత్తం IA:**105/2022** ఇన్ OS: **97/2016** వేసి, మీ పై ఎన్ని మార్లు సమను జారీ చేసినా ప్రతిస్పందించ నందుకు కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారము ఈ ప్రకటన జారీ చేయుచున్నారు. పై విషయమయి మీ ఆకేప్షనలు తెలియ చేయుటకు, మీరు మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ **JUDGE** కోర్ట్ వారి ఎదుట **తేదీ. 14-12-2022** ఖుద్దున గానీ, వకీలు ద్వారా గాని హాజరై మీ అకేప్షనలు తెలియ చేయ గలరు. లేనిచో మీ పరోక్షమున తీర్పు చేయగలరు.

నూక శ్రీరామ మూర్తి
అడ్వకేట్
సెల్: **9989616835,**

శ్రీకాకుళం.
02-12-2022

రూ.14.51 లక్షలకు కొబ్బరి చెక్కల వేలం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

వేలం నిర్వహిస్తున్న ఇఒ హరి సూర్యప్రకాష్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఏడాది కాలం పాటు యాత్రికుల నుంచి వచ్చే కొబ్బరి చెక్కలను పొందడానికి విజయనగరం జిల్లా నెల్లిమర్లకు చెందిన కోరాడ మణికంఠ రూ.14,51,201 హెచ్చు పాట ద్వారా వేలంలో దక్కించుకున్నారు. ఆలయంలోని అనివెట్టి మండపంలో కొబ్బరి చెక్కలతో పాటు తలనీలాల వేలం పాట నిర్వహించారు. కొబ్బరి చెక్కల కోసం పది మంది పోటీ పడ్డారు. గతేడాది రూ.12.30 లక్షలకు వేలం పలకగా, ఈ ఏడాది రూ.2,21,201 అదనంగా పలికింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో నిర్వహించిన తలనీలాల వేలంలో గతేడాది రూ.90 లక్షల కంటే తక్కువ రావడంతో తాత్కాలికంగా వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ఆలయన ఇఒ వి.హరి సూర్యప్రకాష్ ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, దేవాదాయ ధర్మాదాయ శాఖ తరుపున శ్రీకూర్మం ఇఒ జి.గురునాథం, ఇలయ ఇన్‌ఛార్జి సూపరిటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బి.ఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాంప్రసాద్

జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను శ్రీచైతన్య విద్యార్థులు దక్కించుకున్నారు. గత నెల 26 నుంచి 29 వరకు వేద విజ్ఞాన్ మహా విద్యాపీఠ్ ఆధ్వర్యాన బెంగుళూరులో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య పోటీల్లో కూచిపూడి విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న కె.చేతనప్రియ అద్వితీయ ప్రతిభను కనబరచి ప్రథమ స్థానంలో నిలిచింది. తమిళనాడులో నిర్వహించిన నేషనల్ ట్రెడిషనల్ సిలబం ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆరో తరగతి చదువుతున్న ఆర్.హిమవర్షిణి జాతీయస్థాయిలో తృతీయ స్థానం దక్కించుకుంది. గత నెల 29, 30న ఎపి స్పోర్ట్సు అథారిటీ ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ఏడో తరగతి విద్యార్థిని ఒ.మేఘన ద్వితీయ స్థానం దక్కించుకుంది. విద్యార్థులను శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ అభినందించారు.

అర్హులందరికీ 'ఆసరా'

ప్రజాశక్తి - ఆమదాలవలస

మాట్లాడుతున్న వెలుగు ఎపిఎం ప్రసాదరావు

స్వయంశక్తి సంఘాల్లోని అర్హులైన మహిళలందరికీ ప్రభుత్వం మూడో విడత వైఎస్ఆర్ ఆసరా విడుదల చేస్తుందని, అందులో భాగంగా సంఘాల పనితీరు, పుస్తక నిర్వహణతో పాటు, సభ్యుల బయోమెట్రిక్‌ను తీసుకుంటున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పదం అసిస్టెంట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం ఇసకలపేటలో మహిళా సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. పభుత్వం అందిస్తున్న ఆసరా మొత్తాలతోపాటు, మీ జీవనోపాధులను మెరుగుపరుచుకునేలా రుణాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధుల అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, క్లస్టర్ కోఆర్డినేటర్ చంద్రరావు, విఒ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: జగనన్న తోడు రుణాలు రూ.10వేలు మంజూరుకు కృషి చేయ్యాలని వెలుగు ఎపిఎం ప్రసాద రావు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో పలు సూచనలు చేశారు. సంఘాల పొదుపు, ఆదాయ కార్యక్రమాలకు అవసరాలకు వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఒ త్రినేత్ర, సిసిలు రామకృష్ణ, మోహనరావు, విఒఎస్‌లు, తదితరులు పాల్గొన్నారు.

స్టిక్కర్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

- అక్కడ బటన్ నొక్కితే బుడ్డీ తాగుతున్నారు
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు
- జిల్లాలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' ప్రారంభం

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

పాత పనులపైనే పార్టీ రంగులు వేసి, మెరుగులు దిద్దితున్న జగన్మోహన్‌రెడ్డి స్టిక్కర్ ముఖ్యమంత్రి అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. అక్కడ బటన్ నొక్కితే ఇక్కడ బుడ్డీలు తాగుతున్నారని ఇదే ముఖ్యమంత్రి అభివృద్ధా అని ఎద్దేవా చేశారు. సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రలో 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో మరే పార్టీ ఉండకూడదని, తానే 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలన్న జగన్ కోరుకుంటున్నారని, మీలా గాలికి పుట్టిన పార్టీ మాది కాదని ఆరోపించారు. కొంతమంది సర్పంచ్, ఎంపిటిసిలు సీమ టపాకాయల్లా పేలిపోతున్నారని అన్నారు. వైసిపిని గెలిపించిన వారంతా తమ చెప్పులతో వారే కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ముందు స్కామ్, ఇసుక మాఫియా, ప్రాజెక్టుల కట్టడాలపై విమర్శలు కురిపించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బీమారావు, వి.విజయలక్ష్మి, ఎల్ఎల్.నాయుడు, గోవిందరాజులు, అజయ్‌కుమార్, దాసురాజు, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భారంగా జగన్ ప్రభుత్వం

ప్రజలకు భారంగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు అన్నారు. లావేరు మండలం కేశవరాయునిపాలెంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు ఆయన మాట్లాడుతూ జగన్ పోవాలి, బాబు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, మాజీ ఏఎంసి చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర మాజీ జడ్పీటీసీ ఆర్ ప్రకాశరావు దారుపురెడ్డి కూర్మరావు ఆర్ తవిటిబాబు బళ్లాడా గోపాల్రెడ్డి బోరా‌శ్రీను గాలిరెడ్డి నాలుగు మండలాలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కవిటి మండలం కొత్త కొజ్జిరియాలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి అధికార కాంక్ష, అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, సంతోష్ పట్నాయక్, పుల్లట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మందస మండలం దున్నూరులో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పాల్గొన్నారు. గ్రామాల్లో వైసిపి పాలనపై ప్రజలు విసుక్కుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో భావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస మున్సిపాలిటీ లక్ష్ముడుపేటలో, బూర్జ మండలం ఎపి.పేట, కెకె.రాజపురంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల వద్దకు వెళ్లి వారి కష్టాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో అన్ని వస్తువుల ధరలూ ఆకాశాన్ని తాకాయని అన్నారు. జగన్ అధాకారంలోకి వచ్చాక వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో తమ్మినేని గీత, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, గురుగుబెల్లి నాగేశ్వరరావు, కూన ఆంజనేయులు, ఎ.రామకృష్ణంనాయుడు, కె.వెంకట శివసాయి సీతారామరాజు, రాంజీ, జగన్నాథంనాయుడు, శ్రీరాములు, శ్రీరామ్మూర్తి, కృష్ణ, దాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నౌపడ : ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న అచ్చెన్నాయుడు

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగి రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని దమ్మలవీధిలో టిడిపి ఆధ్వర్యాన రాష్ట్రానికి ఇదేం ఖర్మ పేరిట శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కేశవ రాంబాబు, నగర అధ్యక్షుడు మాదరపు వెంకటేష్, సింతు సుధాకర్, జామి భీమశంకరరావు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఉద్యోగావకాశాలు

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి - సోంపేట

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వారు కోరుకున్న రంగాల్లో శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పిస్తామని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం సీడాప్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను ఆమె లంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు కోరుకున్న రంగాల్లో ప్రాథమిక శిక్షణ ఇప్పించి వారికి అర్హత కలిగిన తరువాత ఉపాధి కల్పిస్తామన్నారు. ఇటువంటి అవకాశాలను స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, కంచిలి ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, వైసిపి నాయకులు వజ్జ మత్యుంజయం, కామేష్, రాజారావు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

సిపిఎస్ రద్దు కోసం సంతకాల సేకరణ

ప్రజాశక్తి-రణస్థలం

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ రణస్థలం మండల శాఖ ఆధ్వర్యాన శుక్రవారం సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా యుఎటిఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేటికీ మూడున్నర సంవత్సరాలు గడిచిందన్నారు. అయినప్పటికీ ఈ అంశంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, తక్షణమే సిపిఎస్ రద్దు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.కోదండరామయ్య, టి.శంకరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.నారాయణరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు డి.కోటేశ్వరరావు, మండల సహాధ్యక్షులు వెంకటేశ్వరి, కోశాధికారి డి.కుమారస్వామి, ప్రసూన, అన్నపూర్ణ, భాగ్యలక్ష్మి, తుషార కన్య, జయవాణి పాల్గొన్నారు.

వ్య.కా.స మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వ్య.కా.స నాయకులు

టెక్కలిరూరల్: జంగారెడ్డిగూడెంలో ఈ నెల 8, 9, 10, తేదీలో జరుగునున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సిఐటియు కార్యాలయంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి ఎల్లయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాన్ని 1934లో పచ్చలపల్లి సుందరయ్య ప్రారంభించారని అన్నారు. మూడేళ్ల కాలంలో మండలంలో భూ సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసందని, ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. భవిష్యత్‌లో మరిన్నీ విజయాలు సాధించడానికి మహాసభలు విజయవంతం కావాలన్నారు. కార్యక్రమంలో డి.రమేష్, డి.ప్రసాద్, బి.రవి, బి.నర్సమ్మ, పి.మోహనరావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-రణస్థలం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

గ్రామాభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు శాఖల పనితీరుపై చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, నాయకులు మహంతి పెద్దరామునాయుడు, చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి మైలపల్లి కామరాజు, రెడ్డి విశ్వేశరరావు, రాంబాబు, గొర్లె అప్పలనర్సునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

కోటబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై గ్రామ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పోరాడాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో అచ్చెన్నన్న టిడిపి నాయకులు కలిసి, తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆచ్చెన్న మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన సాగుతోందని, ప్రతి కార్యకర్త, నాయకులను ఇబ్బందుల పాలు చేస్తోందన్నారు. మరో రెండేళ్లు ఓపిక పడితే టిడిపి అధికారంలోకి వస్తుందని చెప్పారు. అప్పటివరకు ఈ సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలని కార్యకర్తలను పిలుపునిచ్చారు. అచ్చెన్నను కలిసిన వారిలో పలు మండలాల ముఖ్య నాయకులు ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన

బహుమతులు అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి

కోటబొమ్మాళి: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సి.హరిప్రియ అన్నారు. అమె శుక్రవారం రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ప్రాథమిక హక్కులు - పౌరుల విధులు' అనే అంశాలపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. వరుస మూడు స్థానాల్లో నిలిచిన ఎం.స్వాతి, ఎం.నందిని,శారదలకు బహుమతులు అందజేశారు. వ్యాస రచన పోటీలో పాల్గొన్న అందరి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి వెలమల అప్పలనాయుడు, న్యాయవాదులు పంచిరెడ్డి అర్జునరావు, పల్లి వాసుదేవరావు, శ్రీధరరాజు, ధర్మారావు తిరుమలరావు, పూజారి వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి - పలాస

పనులను పరిశీలిస్తున్న ఎంపిపి ప్రవీణ

గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పంచాయతీల్లో గుర్తించిన ప్రజా అభివద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పలాస మండల ఎంపీపీ ఉంగ ప్రవీణ అన్నారు. మండలంలోని రెంటికోట పంచాయతీలో జరుగుతున్న అభివద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు తాత్సరం జరగకూడదని, నాణ్యతలో రాజీ పడవద్దని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. గుర్తించిన పనులను ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతకుముందు రెంటికోట పిహెచ్‌సిని పరిశీలించారు. రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలు మరియు అందుబాటులో ఉన్న మందులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఎంపిపి ప్రవీణ, సాయికృష్ణ, రెంటికోటి సర్పంచ్ శాసనపూరి తిరుమల తదితరులు పాల్గొన్నారు

సిసి రహదారి నిర్మాణం


రోడ్డు పనులను పరిశీలిస్తున్న పోలినాయుడు

పొందూరు: మండలంలోని పిల్లల వలసలో అసిరితల్లి అమ్మవారి గుడి వద్ద సిసి రహదారి నిర్మాణం చేపట్టినట్లు శుక్రవారం సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.4.30 లక్షలతో సిసి రహదారితో పాటు రక్షణ గోడను నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. అసిరితల్లి అమ్మవారి గుడివద్ద రహదారి నిర్మాణం చేపట్టడంపై గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయనతోపాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్ పవన్‌కుమార్, పీఆర్ వర్క్ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.

వెంకటరమణకు డాక్టరేట్


వెంకటరమణ

పలాస : మున్సిపాలిటీలోని వైఎస్ఆర్ అవ్వ, తాత కంటి వెలుగు కార్యక్రమంలో నేత్ర వైద్యాధికారిగా పని చేస్తున్న రోణంకి వెంకటరమణకు అడ్మినిస్ట్రేటివ్ అడ్జుడికేషన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు హిమాలయ యూనివర్సిటీ(అరుణాచలప్రదేశ్) డాక్టరేట్ ప్రదానం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సందర్భంలో సిహెచ్‌సి సూపరింటెండెంట్ ఆర్.చిన్నంనాయుడు, గౌతమ్ సునీల్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బి.గోపాల్, తదితరులు అభినందించారు.

ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి - టెక్కలి

ఓటరు నమోదుపై బిఎల్‌ఒలకు అవగాహన తప్పనిసరి అని సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఫారం-6ను ఏ విధంగా వినియోగించుకోవాలో వివరించారు. ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు, సవరణకు ఎటువంటి పద్ధతులు అవలంబించాలో అవగాహన కల్పించారు. వారికి సందేహాలను నివృతి చేశారు. సమావేశంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ కిషోర్, ఎన్నికల డిటి అనిల్, మండల స్థాయి బిఎల్‌ఒలు, రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లావేరు : అర్హులైన 18 ఏళ్లు నిండిన యువతను నూతన ఓటరుగా నమోదు చేయాలని ఎచ్చెర్ల అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఒ ఎం.రాజేశ్వరి బూత్‌లెవల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు చేయాలన్నారు. మృతి చెందిన వారుంటే జాబితా నుంచి తొలగించాలని అన్నారు. సమావేశంలో లావేరు తహశీల్దార్ సాధు దిలీప్ చక్రవర్తి, ఎలక్షన్ డిటి జిఎల్.శ్రీనివాసరావు, ఆర్ఐ రామచంద్రరావు, రత్నకుమార్, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మాట్లాడుతున్న పద్మావతి

ఆమదాలవలస: ఓటరు నమోదుపై బిఎల్‌ఒలతో తహశీల్దార్ వైవి.పద్మావతి తన కార్యాలయంలో శుక్రవారం సమావేశం అయ్యారు. శని, ఆదివారం ఓటు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ మురళీధర్ నాయక్, రీ సర్వే డిటి శ్రీనివాసరావు, బూత్ లెవెల్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యం

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా అంతర్జాతీయ మానవహక్కుల అసోసియేషన్ ఆఫ్ ఇండియా కృషి చేస్తుందని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహనరావు చెప్పారు. విద్యార్థులకు మానవ హక్కులు-బాధ్యతల గురించి చైతన్యపరిచేందుకు శుక్రవారం ఐతమ్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా హక్కులకు భంగం కలిగిన పక్షంలో బాధితులకు రక్షణగా ఉంటూ పోరాటం చేస్తామని అన్నారు. విద్యాహక్కు, ప్రశ్నించే హక్కుల గురించి రాష్ట్ర కార్యదర్శులు నాగ కృష్ణారావు, ఎస్.అన్నాజీరావు వివరించారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలి తప్ప మార్కుల కోసం, సర్టిఫికేట్ల కోసం కాదని అన్నారు. సమాజం కోసం అద్యయనం చేయని వారు ఎన్ని మార్కులు సాధించినా రాణించలేరని హెచ్ఆర్ఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బి.దామోదరరావు, కెవిఎస్.నాయుడు హితవు పలికారు. టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు రాష్ట్రంలో ఒక మంచి గుర్తింపు ఉందని, ఆ గుర్తింపునకు తగినట్టుగా విద్యార్థులు క్రమశిక్షణతో వ్యవహరించి విద్యాభ్యాసం చేయాలన్నారు. జూనియర్లను సోదర భావంతో చూసి అందరూ చదువుకొనే హక్కును కల్పించాలని కోరారు. ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవహక్కులు పరిరక్షించబడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. తమ హక్కులను కాపాడుకుంటూ ఎదుటి వారి హక్కులకు భంగం కలగకుండా వ్యవహరించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం ఈ సదస్సు ఆవస్యకతను వివరించారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామ్మోహనరావు

రైతు శ్రేయస్సు ధ్యేయం

ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుభరోసా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోగల జీయన్నపేట గ్రామ రైతుభరోసా కేంద్రంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎడిఎ ఆర్. రవిప్రకాష్, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, కవిటి రామరాజు, ఎంపిటిసి నంబాళ రాజశేఖర్, ఎఒ గోవిందరావు, సర్పంచ్ బలగ సూర్యారావు, నూక సత్యరాజ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రం-1లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. వసప గ్రామ సచివాలయం వద్ద జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అంతకుముందు ఖురిగాం పంచాయతీ మహదేవిపురంలో గద్దె రవికుమార్ కుమార్తె లావణ్య ఫంక్షన్‌కు ఎమ్మెల్యే వెళ్లి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎడి రాజగోపాలరావు, ఎఎంసి చైర్‌పర్సన్ జి.మాధవి, సర్పంచ్ పి.కృష్ణవేణి, ఎంపిటిసి రత్నకుమారి, పిఎ సిఎస్ అధ్యక్షులు సూర్యనారాయణ, తహశీల్దార్ బాల, నాయకులు వరప్రసాదరావు, ఆఫీసురావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రెడ్డి శాంతి

యంత్రంలో ఇరుక్కున్న రాజారావును బయటకు తీస్తున్న కూలీలు

యంత్రంలో చిక్కుకొని

ఇటుక బట్టీ యజమాని దుర్మరణం

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు మండలం కేశవదాసుపురం గ్రామంలో ఇటుకబట్టీలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇటుకబట్టీ యజమాని నల్లి రాజారావు(51) మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు కేశవదాసుపురం గ్రామానికి చెందిన రాజారావు గ్రామంలోని సొంత ఇటుకబట్టీలో పని చేస్తున్నాడు. మట్టిని శుభ్రం చేసే యంత్రంలో ప్రమాదశాత్తు కాలు ఇరుక్కుంది. వెంటనే కుటుంబసభ్యులు, పనిచేస్తున్న కూలీలు యంత్రం నుంచి కాలును వేరు చేశారు. కాలు తెగి రక్తం ఎక్కువగా కారింది. వెంటనే రాజారావును శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యజమాని మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతునిభార్య సూరీడమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. రాజారావు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

లారీ ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని అక్కివరం పంచాయతీ గోపినగర్‌కు చెందిన తాండ్ర భీమేశ్వరరావు (72) లారీ ఢీకొని మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. భీమేశ్వరరావు వ్యవసాయ పనులను ముగించుకుని మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భోజనానికి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో హైవేను దాటుతుండగా విశాఖపట్నం వైపు నుండి ఒడిశా వైపు చేపల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో రెండు కాళ్లు నుజ్జు నుజ్జు అయ్యి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు 108 వాహనంలో వైద్య సేవల కోసం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు. మృతుడు భార్య తాండ్ర రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభం కాని ఆర్‌బికెలు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతు భరోసా కేంద్రం-2

సంతబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సచివాలయం పరిధిలో ఒక రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని భావించింది. ఆ ఉద్దేశంలో భాగంగా సంతబొమ్మాళి సచివాలయం-1, 2 పరిధిలో రెండు రైతు భరోసా కేంద్రాలు నిర్మించింది. రైతు భరోసా కేంద్రం-1కి రూ.21.80 లక్షల అంచనా వ్యయంతో నిర్మించారు. ఈ నిర్మాణ బాధ్యతలను దూబవేణుకు చెందిన అధికారులకు అప్పజెప్పారు. నాలుగు సార్లు బిల్లులను వివిధ దశల్లో 14,43,780లను అధికారులు చెల్లించారు. ఈ రైతు భరోసా కేంద్రానికి విద్యుత్ సదుపాయంతో పాటు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్‌లు మాత్రమే వేయాల్సి ఉంది. రైతు బరోసా కేంద్రం-2 నిర్మాణం కోసం రూ.21.80 లక్షలతో నిర్మాణం చేపట్టారు. దీనికి ఇప్పటివరు వివిధ దశలో రూ.14,60,386 చెల్లించారు. భరోసా కేంద్రానికి విద్యుత్ ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ర్యాంపు మాత్రమే నిర్మించవలసి ఉంది. 90శాతం పూర్తయినా ప్రారంభంచకపోవడంతో రైతులు, అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరగా ప్రారంభం చేయాలని కోరుతున్నారు.

సిఎస్‌ను కలిసిన పురుషోత్తం నాయుడు

సిఎస్ జవహర్‌రెడ్డిని కలిసిన పురుషోత్తం నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జిల్లా పూర్వ కలెక్టర్ కె.ఎస్ జవహర్ రెడ్డిని సచివాలయంలోని బ్లాక్ నంబర్-2లో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ రాష్ట్ర నాయకులతో కలిసిన ఆయన ఉద్యోగుల సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

రేపు సొండికుల సంక్షేమ సమ్మేళనం

ప్రజాశక్తి - కవిటి, రణస్థలం
కవిటి మండలంలోని కొత్త కొజ్జిరియా గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న సొండికుల సంక్షేమ సమ్మేళనంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సొండికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ్ చౌదరి, ఇచ్ఛాపురం నియోజకవర్గ అధ్యక్షుడు మొగిలిపురి సింహాచలపతి కోరారు. శుక్రవారం వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో వారు మాట్లాడారు. ఉదయం 10గంటలకు సొండికుల సంక్షేమ సంఘం భవన సముదాయంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపం, అదనపు భవనంతో పాటు వంటశాల ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. సొండి కులానికి ప్రత్యేక కార్పొరేషన్, ఒబిసి తదితర అంశాలతో పాటు వన భోజన కార్యక్రమం ఉంటుందని వారు చెప్పారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, సొండి కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మొగిలిపురి సింహాచలపతి, కదంబాల దినేష్ కుమార్, తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గిరిజన పాఠశాలలు తనిఖీ

కొత్తూరు: మండలంలోని గొట్టిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల, భూతలగూడ ప్రాథమిక పాఠశాలను సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు మోనటరింగ్ రీసోర్స్ కేంద్రం అధికారులు ఎఎంఒ కె.కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ సందర్శించారు. శుక్రవారం పాఠశాలలో ఉన్న విద్యార్థులు హాజరు పట్టీ, రికార్డులను పరిశీలించారు. సమ్మెటివ్-2 పరీక్ష నిర్వహణ, టిఎల్‌ఎం, టీచర్ డైరీలను పాఠశాల పనితీరును, మధ్యాహ్న భోజనం నిర్వాహణను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

ఏనేటి కొండలను ఎస్‌టిల్లో చేర్చవద్దని వినతి

టెక్కలి: జిల్లాలో ఉన్న ఏనేటి కొండలను ఎస్‌టిలో చేర్చవద్దని ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక జిల్లా కార్యదర్శి ఎన్.నాగరాజు కోరారు. శుక్రవారం టెక్కలి సబ్ కలెక్టర్ తాటిమాకుల రాహుల్‌కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఆయనతో పాటు నాగరాజు, బి.తిరుపతిరావు, ఎస్.షణ్ముఖరావు, జె.కాంతారావు, ఎం.జగ్గారావు, కళ్యాణరావు, తదితరులు ఉన్నారు.

కిసాన్ మోర్చా మన్యం జిల్లా ఇన్‌ఛార్జిగా గోవిందరావు

కొత్తూరు: మన్యం జిల్లా ఇన్‌ఛార్జిగా కొత్తూరుకు చెందిన కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చోడవరపు గోవిందరావును ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు సెబిభూషన్‌రెడ్డి, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి పి.రవిరాజా నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

ఎంఆర్‌సికి చేరిన ట్యాబ్‌లు

జలుమూరు: మండల కేంద్రంలోని ఎంఆర్‌సికి 226 ట్యాబ్‌లు శుక్రవారం వచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారి బమ్మిడి మాధవరావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అమ్మఒడి అందజేస్తుండగా అమ్మఒడి నగదు కాకుండా ట్యాబ్ కావాలని ఆప్షన్ ఇచ్చిన విద్యార్థులకు ఇవి అందజేయనున్నట్లు ఎంఇఒ చెప్పారు. ఈ ట్యాబులను ఆయా పాఠశాలలకు అందజేసి విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.

ఘనంగా కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.లతా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్ అక్షరాస్యతా ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వెనుకబడిన కమ్యూనిటీలలో అవగాహన కల్పించడానికి, డిజిటల్ అక్షరాస్యతను పెంచడానికి ఈరోజు ఎంతో దోహదపడిందన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ

మెళియాపుట్టి: ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం క్లస్టర్‌లో రాయితీపై మొక్కజొన్న, పొద్దు తిరుగుడు విత్తనాల పంపిణీని ఎఒ దానకర్ణుడు, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు రైతులకు పంపిణీ చేశారు. శుక్రవారం కొసమాల రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులకు రాయితీపైన విత్తనాలు పంపిణీ చేశారు. ముఖ్యంగా రైతు సోదరులు పంట మార్పిడి విధానంపై ఆసక్తి చూపించాలని వారు అన్నారు. నేల సారవంతం అవడంతో పాటుగా పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు యమున, రైతులు పాల్గొన్నారు.

పింఛను కోసం 718 దరఖాస్తులు

జలుమూరు: వైఎస్ఆర్ పింఛను కానుకకు 718 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపిడిఒ జివి.రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నవంబరు 30తో దరఖాస్తు గడువు ముగిసిందని తెలిపారు. ప్రభుత్వం అర్హులను ఎంపిక చేసి, సచివాలయంలో లిస్టు పెడుతుందని చెప్పారు. వారికే పింఛను వస్తుందని అన్నారు.

సొంతింటి కల నెరవేర్చుకోవాలి

ప్రజాశక్తి - కవిటి
జగనన్న హౌసింగ్ పథకం ద్వారా మహిళలు సొంతింటి కలను నెరవేర్చుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ అధికారి సిహెచ్ మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. జగనన్న ఇళ్ల నిర్మాణంపై మహిళా సంఘాల సభ్యులు, సిసిలు, సిఎఫ్‌లకు స్థానిక మహిళా సంఘాల భవనంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయించి, ఇసుకను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. సిమెంటు, ఐరన్ మార్కెట్ ధరలు కంటే తక్కువ ధరకే జగనన్న గృహ నిర్మాణాలకు అందిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లోని లబ్ధిదారులకు దీనిపై అవగాహన కల్పించి, ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం గోవింద్, సిసి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలపై అవగాహన

పోలాకి: రైతులకు రబీ పంటలపై అవగాహన అవసరమని కెవికె శాస్త్రవేత్త చిట్టిబాబు అన్నారు. శుక్రవారం డోల గ్రామంలోని ఆర్‌బికెలో రబీ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు రబీ సీజన్లో మన ప్రాంతంలో ఉన్న నేలలకు అనుకూలంగా ఉన్న పంటలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. అనంతరం మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.భైరాగినాయుడు, కణితి కృష్ణారావు, డోల ఉదయభాస్కర్, ఎడిఎ రవీంద్రభారతి, ఎఒ చిరంజీవి, నాయకులు కె.నారాయణరావు, ఆర్.త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఎఇ బాధ్యతల స్వీకరణ

పొందూరు: విద్యుత్‌శాఖ ఎఇగా పైడి దుర్గాప్రసాద్ శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఈయన విశాఖపట్నంలోని నర్సీపురం ఎఇగా పనిచేసి, ఇక్కడకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఎఇగా ఉన్న రవికాంత్ నుంచి ఈయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్‌శాఖ సిబ్బంది ఈయనకు అభినందనలు తెలిపారు.

పారిశుధ్య కార్మికుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - పలాస
పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయంలో ఇటీవల మృతిచెందిన పారిశుధ్య కార్మికుడు కుటుంబానికి రూ.15 వేలు తక్షణ సాయంగా మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు శుక్రవారం అందించారు. శుక్రవారం తన ఛాంబరులో కుటుంబసభ్యులకు అపకాస్ అందించిన సాయాన్ని అందించారు. కుటుంబసభ్యులకు పిఎఫ్, ఇతర సదుపాయాలు త్వరగా కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అపకాస్ అధికారి బొంగి నాగప్రసాద్, మున్సిపల్ కమిషనర్ టి.రాజాగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ
ఉపాధ్యక్షులుగా ఇందిరాప్రసాద్

శ్రీకాకుళం అర్బన్: నగరానికి చెందిన వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్‌ను జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ ఉపాధ్యక్షునిగా నియమిస్తూ సంబంధిత అసోసియేషన్ నియామక పత్రాన్ని అందజేసింది. స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు నియామక పత్రాన్ని ఆయనకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జోగినాయుడు, వి.జగన్నాథనాయుడు, డాక్టర్ గంజి ఎజ్రా, దేవీప్రసాద్, పాలిన ప్రసాద్, ఎన్.కృష్ణమూర్తి, జి.సంతోష్‌కుమార్, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస
జన సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం పట్టణంలోని 2వ వార్డు కృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల లబ్ధిదారులకు ఒనగూరిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీతారాం మాట్లాడుతూ పాలనలో విప్లవాత్మక మార్పులతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశానికే తలమానికంగా తీర్చిదిద్దారని చెప్పారు. కార్యక్రమంలో కమిషనరు ఎం.రవిసుధాకర్, ఎఇ కె.అప్పలనాయుడు, ఎలక్ట్రికల్ ఎడి బి.రాంబాబు, ఎస్ఐ కృష్ణ, నాయకులు కె.రామకృష్ణ, ఎ.ఉమామహేశ్వరరావు, డి.శ్యామలరావు, ఎం.రమేష్, బివి.రమణమూర్తి,ఎస్.రామారావు, కె.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో భావనపాడు పోర్టుకు శంకుస్థాపన

వజ్రపుకొత్తూరు: మత్స్యకారులకు స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే భావనపాడు పోర్ట్‌కు సిఎం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పల్లివూరు పంచాయతీ హుకుంపేటలో శుక్రవారం సర్పంచ్ మామిడి భాస్కరరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నువ్వలరేవు-మంచినీళ్లపేట మధ్య రూ. 12 కోట్లతో జెట్టి నిర్మాణం స్థానంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం డిజైన్ మార్చడానికి అధికారులకు సూచనలు చేశామన్నారు. అర్హులైన వారికి ఎక్కడైనా ప్రభుత్వ పథకాలు అందకుంటే సరిచేయడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో పాలిన శ్రీనివాసరావు, ఉప్పరపల్లిఉదయ్‌కుమార్, దువ్వాడ మధుకేశవరరావు, పి.గురయ్యానాయుడు, వి.రాజు, ఎం.భాస్కరరావు, ఎస్.రాజేశ్వరి, గురుప్రసాద్, ఉపేంద్ర, నర్తు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీదిరి అప్పలరాజు

ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు తగదు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్
ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు తగదని పలువురు వక్తలు పేర్కొన్నారు. దేశంలో కుల వివక్షత, అణచివేత, అవమానాలు అనుభవిస్తున్న అణగారిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించి ఆర్థికంగా వారిని ఆదుకునేందుకు, సమాజంలో గౌరవాన్ని పెంచేందుకు రాజ్యాంగం ద్వారా కల్పించారని చెప్పారు. నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలును వ్యతిరేకిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కెఎన్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య మాట్లాడుతూ పేదరికం ఆధారంగా రిజర్వేషన్ల ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అగ్ర కులాల్లోని పేదలకు ఆర్థికంగా ప్రభుత్వాలు ఆదుకోవాలే తప్ప 10శాతం రిజర్వేషన్లు కల్పించడం సరికాదన్నారు. రూ.8లక్షల సంవత్సరాదాయం కలిగి, ఐదెకరాల భూమి ఉన్న అగ్ర కులాల వారిని పేదలుగా గుర్తించడం అన్యాయమన్నారు. రూ.రెండు లక్షల సంవత్సర ఆదాయం కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను ఉన్నత వర్గాలుగా గుర్తించి ఇన్‌కమ్ సర్టిఫికేట్, తెల్ల రేషన్‌కార్డు ఇవ్వకుండా, కనీసం స్కాలర్‌షిప్, హాస్టల్ సీటు ఇవ్వకూడదనే నిబంధనలు అమలు చేస్తోందన్నారు.

దేశ సంపదను కబళిస్తున్న అగ్రకుల ఆధిపత్య శక్తులు అధికారం చేజిక్కించుకొని చేస్తున్న విధ్వంసంలో సమిధలౌతన్న దేశప్రజలందరూ సమిష్టిగా రాజ్యాగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకమన్నారు. ఎస్.వి జగన్నాథం అధ్యక్షత వహించిన సమావేశంలో బిసి సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రపతిరావు, గజపతి, అరుణోదయ సంస్కృతీ సంస్థ రాష్ట్ర నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, ఎస్ఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.రాంగోపాల్, ముస్లిం నాయకులు షాను, జిలాని, ఎస్ఎన్‌పిఎస్ నాయకులు డి.గణేష్, మానవ హక్కుల వేదిక నాయకులు కె.వి.జగన్నాథరావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వేణుగోపాల్

ఎఎన్‌ఎం కోర్సులకు 99 మంది ఎంపిక

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జెసి నవీన్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్
జిల్లాలోని మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎఎన్‌ఎం) కోర్సుల్లో చేరేందుకు ఐదు కళాశాలల్లో సీట్ల భర్తీకి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆధ్వర్యాన చేపట్టిన కౌన్సెలింగ్‌లో 99 మందిని ఎంపిక చేశారు. రోస్టర్ ఆధారంగా కన్వీనర్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా కింద సీట్లను భర్తీ చేశారు. జెసి నవీన్ మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థినులు కష్టపడి చదువుకుని రాణించాలన్నారు. శిక్షణా కాలంలో శ్రమించడం ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. నారాయణ నర్సింగ్ కాలేజ్, గుడ్‌వెల్, సత్యసాయి, పైడితల్లి, నాగావళి ఎంపిహెచ్‌డబ్ల్యు ట్రైనింగ్ సెంటర్లకు వీరిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ ఎ.స్వామినాయుడు, పిఒడిటిటి కృష్ణమోహన్, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, ఆఫీస్ సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్, వెంకటేశ్వర్లు, సంతోష్, దాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్లను అభినందిస్తున్న ప్రసాదరావు

వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లాకు పతకాలు

శ్రీకాకుళం అర్బన్: గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో గత నెల 26 నుంచి 28 వరకు నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి యూత్, సీనియర్, జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ (మెన్, ఉమెన్) ఛాంపియన్‌షిప్-2022 పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఐ.అప్పన్న ఆధ్వర్యాన శిక్షణ తీసుకుంటున్న ఐదుగురు క్రీడాకారులు పలు విభాగాల్లో మెడల్స్ సాధించారు. జె.హేమశ్రీ 45 కిలోల సీనియర్, జూనియర్ లెవల్‌లో బ్రాంజి, జి.వర్షిత 59 కిలోల యూత్ లెవల్లో సిల్వర్, గోల్డ్, జూనియర్ లెవల్లో సిల్వర్ పతకాలను సాధించింది. టి.కావ్య 59 కిలోల్లో బ్రాంజి, యూత్ లెవల్, జూనియర్ లెవల్‌లో సాధించింది. ఎన్.లలిత సీనియర్ లెవల్‌లో గోల్డ్, యూత్ లెవల్‌లో 61 కిలోల్లో సిల్వర్ సాధించింది. పతకాలు సాధించిన క్రీడాకారులను సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, డిఎస్‌డిఒ మాధురీలత, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఐ.భాస్కరరావు, కార్యదర్శి కె.శ్రీనివాసరావు అభినందించారు.

మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రాజగోపాలరావు

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

జలుమూరు: మండలంలో వరి కోతలు పూర్తి కానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.రాజగోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులు, ధాన్యం కొనుగోలు ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కళ్లాల వద్దకే సిబ్బంది వెళ్లి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానాలపై రైతులకు అవగాహన కల్పించి, రైతు భరోసా కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రైతుకూ ప్రభుత్వ మద్దతుధర అందేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ జివి.రవికుమార్, ఎఒ సురేష్, గణేష, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహనా ర్యాలీ

అవగాహనా ర్యాలీలో డ్వామా పీడీ చిట్టిరాజు

మెళియాపుట్టి: స్థానిక వెలుగు కార్యాలయం నుండి మెళియాపుట్టి మెయిన్ రోడ్డు వరకు లింగ వివక్షతపై అవగాహన ర్యాలీ ఎపిఎం లలిత ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానమేనని, అన్ని హక్కులు కలిగి ఉంటారని అన్నారు. స్త్రీల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, సర్పంచులు జనపరెడ్డి కన్నబాబు, పెద్దింటి చంద్రరావు, ప్రసాద్‌రావు, రుషి, జై.మునిరావు, గౌరేష్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

టెక్కలి రూరల్: పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని టెక్కలి సిఐ సూర్య చంద్రమౌళి అన్నారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలో విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ టీవీలు, సెల్‌ఫోన్లకు అలవాటు పడ్డారని, అయినా పుస్తకానికి ఉన్న విలువ నేటికీ తగ్గలేదన్నారు. ఈ అవకాశాన్ని టెక్కలి పట్టణ ప్రజానీకం వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎం.యుగంధర్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి వై.గోపి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎ.షణ్ముఖరావు, సిపిఐ మండల కార్యదర్శి సింహాచలం, విశాలాంధ్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - పోలాకి
సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహణలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, మంచి పేరు తెచ్చుకోవాలని నోడల్ అధికారి పి.వాసుదేవరావు సూచించారు. శుక్రవారం ధీర్ఘాశి, గొల్లలవలస సచివాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలం ఉద్యోగుల హాజరు, రికార్డులు నిర్వాహణ, స్పందన ద్వారా వచ్చే వినతలు వాటి పరిష్కారం, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరరావు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలతో ప్రయోజనం

ప్రజాశక్తి - సోంపేట
మండలంలోని పలాసపురం సచివాలయం వద్ద శుక్రవారం జెడ్‌పి చైర్‌పర్సన్ పి.విజయ శాశ్వత భూ హక్కు పత్రాలను రైతులకు అందజేశారు. జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ జోగారావు ఆధ్వర్యంలో మీ భూమి మా హామి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ శాశ్వత భూ హక్కు పత్రాల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్, డిటి గౌరీ శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలతో ఎంతో లాభమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ అవరణంలో శుక్రవారం రీ సర్వే పూర్తయిన ఎనిమిది గ్రామాల్లో 856 మంది రైతులకు భూహక్కు పత్రాలను తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామాల్లో సర్వే పూర్తిచేయగా, ఎనిమిది గ్రామాలకు శాశ్వత భూహక్కు ప్రతాలను అందజేసినట్లు చెప్పారు. సర్వే అనంతరం గ్రామాల్లో ఎటువంటి వివాదాలు ఉండవన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, కవిటి రాజారావు, బి.నాగేశ్వరరావు, రోజారామకృష్ణ, మంద లోకనాథం, కె.సంజీవరావు, జి.కేశరావు, బి.గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు పత్రాలను అందజేస్తున్న విజయ

గరిష్ట కూలి వచ్చేలా 'ఉపాధి' పనులు

ప్రజాశక్తి - ఆమదాలవలస
ఉపాధి హామీ కూలీలకు రూ.257 రోజు కూలి వచ్చేలా పనులు చేపట్టాలని ఎపిఒ సురవరపు లక్ష్మీనరసమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ, అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి, పనులు గుర్తించాలని అన్నారు.

కనుగులవల సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ గత ఏడాది చేసిన పనులకు ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని, మళ్లీ ఇప్పుడు పనులు చేపడితే బిల్లులను చెల్లిస్తారా? అని ఎపిఒను ప్రశ్నించారు. ఫీల్డ్‌అసిస్టెంట్‌కు ఏడాదిగా జీతం లేదని అన్నారు. స్పందించిన ఎపిఒ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బి.గోవిందరావు, ఎం.కాళేశ్వరరావు, వాసుదేవరావు, జి.రాము, తదితరులు పాల్గొన్నారు.

పలాస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ఉపాధి హామీ నిధులను మంజూరు చేస్తున్నాయని ఎంపిపి ఉంగ ప్రవీణ అన్నారు. కాశీబుగ్గ స్త్రీ నిధి భవనంలో శుక్రవారం సర్పంచ్‌లు,ఎంపిటిసిలుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపాధి కూలీలకు ఉపాధి కల్పించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎపిఒ ఎ.శంకరరావు, వైసిపి నాయకులు ఉంగ సాయికృష్ణ, ఎన్‌ఆర్‌ఇజిఎస్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమ్మినాయుడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎపిఒను ప్రశ్నిస్తున్న సర్పంచ్ నూకరాజు

110 పంట కోత ప్రయోగాలు

ప్రజాశక్తి - జి.సిగడాం
విశాఖ సబ్ రీజనల్ పరిధిలో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పరిధిలో ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట దిగుబడుల కోసం 110 పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నామని జాతీయ గణాంకాల అధికారి సింగుపురం వెంకటేశ్వరావు వెల్లడించారు. ఆయన మండలంలోని నడిమివలస గ్రామంలో పంట కోత ప్రయోగాలను పరిశీలించారు. సబ్ రీజనల్ పరిధిలో ఇంతవరకు 45 పంట కోత ప్రయోగాలు నిర్వహించామన్నారు. మిగతావి మరో వారం రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. వంద హెక్టార్లను ఒక యూనిట్‌గా గుర్తించి పంట కోత ప్రయోగాలను చేపడుతున్నామని అన్నారు. ప్రత్యేక సిబ్బందితో ఈ ప్రయోగాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ-క్రాప్ ద్వారా పంటలను నమోదు చేయాలన్నారు. ఒక్కో గ్రామంలో రెండు, మూడు సార్లు పంటకోత ప్రయోగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రయోగాల ద్వారా పంటల దిగుబడి, పశుగ్రాసం, వర్షపాతం, నీటి నిల్వల బట్టి ఆ గ్రామానికి బీమా వర్తిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎఒ వై.శారద, మండల ఉప గణాంక అధికారి పొదిలాపు ఉషారాణి, వ్యవసాయ విస్తరణాధికారి కంబాల జగదీశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు చేస్తున్న సిబ్బంది

ధాన్యం కొనుగోలులో రైతులకు సహకారం

సోంపేట: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అన్ని విధాలా సహకరించాలని తహశీల్దార్ రమేష్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, వాలంటీర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతులు ధాన్యం విక్రయించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. దళారి వ్యవస్థకు అవకాశం లేకుండా అధికారులు అన్ని స్థాయిల్లో రైతులకు అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ నరసింహమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ లావణ్య అధ్యక్షతన వ్యవసాయ, రెవెన్యూ, పిఎసిఎస్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో ఎఒ శ్రీదేవి, సివిల్ సప్లై డిటి. సంతోషకుమార్, రెవెన్యు అధికారి శ్రావణకుమార్, విఆర్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న తహశీల్దార్ లావణ్య